# SHRI SAINATH STAVANAMANJARI



హరి భక్తపరాయణ

శ్రీదాసగణూ కృత

# శ్రీ సాయినాథ స్తవన మంజరి

సర్వం శ్రీసాయి సేవా ట్రస్ట్

Regd. 192/2019

# హరి భక్తపరాయణ

## శ్రీదాసగణూ కృత

## శ్రీ సాయినాథ స్తవన మంజరి

శ్రీ గణేశాయనమః ఓ సర్వాధారా! మయురేశ్వరా! సర్వసాక్షి గౌరికుమారా!ఓ అచింత్యా! లంబోదరా! శ్రీ గణపతి పాహిమాం.

1. నీవు సకల గణాలకు ఆది ఈశ్వరుడవు. అందుకే నిన్ను గణేశుడని అంటారు. సకల శాస్త్రాలు నిన్ను ఆంగీకరిస్తున్నాయి. మంగళారూపా! పాలచంద్రా...!

2. ఓ శారదా ! వాగ్విలాసినీ! నీవు పదాలను సృష్టించిన వాగీశ్వరివి. నీ అస్తిత్వం వలననే జగత్తులోని వ్యవహారాలు నడుస్తున్నాయి

3.  నీవు గ్రంధకర్తల దేవతవు. నీవు దేశానికి ఎల్లప్పుడూ భూషణానివి. అన్నిటియందు నీ శక్తి అగాథం. జగదాంబా! నీకు నమస్కారం.

4.  ఓ పూర్ణబ్రహ్మ! సాధుసజ్జనప్రియా! ఓ సగుణరూపా!పండరీనాధా!కృపాసాగరా,పరమ దయామయా!పాండురంగా! నరహరి!

5.నీవు అందరిని నడిపించే సూత్రదారివి. నీవు జగమంతటా వ్యాపించి  వున్నావు. సకల శాస్త్రాలు నీ స్వరూపాన్ని పరిశోదిస్తున్నాయి.

6.  ఓ చక్రపాణి! నీవు పుస్తకాజ్ఞానులకు అంతుపట్టవు .ఆ మూర్ఖులందరూ వాద వివాదాలు చేసేవారు.

7.  సాధువులు మాత్రమే నిన్ను తెలుసుకోగలరు. మిగతవారు మౌనంగా వుంటారు.నీకు సాదరంగా నా సాష్టాంగనమస్కారం.

8.  ఓ పంచవక్రా శంకరా! కపాలమాలధారీ! ఓ నీలకంఠ!దిగంబరా!ఓంకారరూపా!పశుపతీ!

9. నీ నామాన్ని స్మరించిన వారి దైన్యం వెంటనే తొలగిపోతుంది.ధూర్జటీ! నీ నామం యొక్క మహిమ ఇటువంటిది.

10. నీ చరణాలకు వందనం చేసి నేను ఈ స్తోత్రాన్ని రచిస్తాను. నీలకంఠా! దీనిని సంపూర్ణం చేసేలా సహకరించు.

11. ఇప్పుడు అత్రిసుతునకు ఆదినారాయణునికి తుకారామాది సత్పురుషులకు మరియు భక్తులందరికి నమస్కారం

12. జయ జయ సాయినాథా, పతిత పావన! పరమదయాళూ! పవిత్ర చరణాలయందు శిరస్సు నుంచుతున్నాను.అభయాన్ని అనుగ్రహించండి.

13. మీరు సుఖానికి నిలయమైన పూర్ణాబ్రహ్మ. పురుషోత్తముడు అయిన విష్ణుమూర్తి మీరే. అర్ధనారీశ్వరుడు మదనాంతకుడు కూడా మీరే.

14. మానవ శరీరాన్ని ధరించిన పరమేశ్వరులు.మీరు జ్ఞానాకాశంలోని భాస్కరులు,దయా సాగారులు. మీరు భవరోగానికి ఔషధం.

15. మీరు హీనులకు,దీనులకు చింతామణి. భక్తులకు పవిత్రగంగాజలం. మీరు ప్రపంచంలో మునిగిపోయే వారిని తరింపచేసే నౌక.మీరు భయభీతులకు ఆశ్రయం.

16. మీరు జగత్తుకు ఆది కారణం. దయాఘనా! నిర్మల చైతన్యమైన ఈ సృష్టి విలాసం అంతా మీదే.

17. మీరు జన్మరహితులు.మీకు మృత్యువు లేదు.బాగా పరిశోధిస్తే చివరకు ఇదే అవగతమౌతుంది.

18. జననమరణాలు రెండు అజ్ఞానం వలన కలుగుతాయి. మహారాజా! మీరు రెండిటికి అలిప్తంగా వుంటారు.

19. నీరు ఒక చోట ఊటలా ప్రకటితమైంది అంతే, అది అక్కడే పుట్టి పైకి వచ్చిందా? అది ఆది నుండి అక్కడే పూర్ణంగా నిండి ఉండి లోపల నుండి వచ్చింది. అంతే.

20.  ఒక లోతు గుంతలో నీరు ఊరితే దానికి బావి అని పేరు కలుగుతుంది. నీరు లేకపోతే అది ఒక గుంత మాత్రమే.

21.  నీరు గుంతలో ఉరటం లేదా ఎండిపోవడం ఇది నీటికి అసలు పట్టదు. నీరు గుంతకు అసలు ఏ విలువ ఇవ్వదు.

22. అయినా నీరు నిండుగా ఉన్నప్పుడు గుంతకు మాత్రం గర్వం. అందువలన నీరు బాగా ఇంకిపోగానే దైన్యావస్థను పొందుతుంది.

23. ఈ మానవ శరీరం నిజంగా గుంత వంటిది. ఇందులోని శుద్ధచైతన్యం నిర్మలమైన నీరు. గుంతలు అసంఖ్యాకంగా ఉన్నా నీరు అన్నింటిలో ఒక్కటే. శరీరాలు అనేకం చైతన్యం ఒక్కటే.

24. దయామయా! జననమరణాలకు అతీతమైన మీరు. అజ్ఞానమనే పర్వతాన్ని ఛేదించడానికి వజ్రాయుధం కావాలి.

25. భూమి పై ఇప్పటి వరకు అనేక గుండాలు వెలిశాయి.ఇప్పుడు ఉన్నాయి . ఇక ముందు ఉంటాయి.

26. ఆయా ప్రత్యేక గుండానికి విశేషమైన నామరూపాలు ఉంటాయి. వాని ద్వారానే గుర్తించగలం.

27. అయితే చైతన్యాన్నీ నువ్వు - నేను అనటం ఉచితం కాదు.ఎందుకంటే చైతన్యం లో ద్వైతం లేదు కనక

28. పైగా చైతన్యం జగమంతటా వ్యాపించి ఉంటుంది. అటువంటప్పుడు నీవు -నేను అనుభావన అక్కడ ఎలా సంభవం?

29. మేఘాలలోని నీరు అంతటా ఒకేలా ఉంటుంది. భూమి పై పడగానే ఆ నీటికి అనేక బేధాలు కలుగుతాయి.

30. గోదావరిలో పడిన నీటిని గోదావరి అని అంటారు.బావిలో పడిననీటికి నది జలానికి ఉన్న పవిత్ర లేదు.

31. గోదావరి సత్పురుషుల వలే పవిత్రం. మీరు అందులోని నీరు. మేము అక్కడక్కడా ఉన్న వాపీ,కూప,తటకాలము అదే మీకు మాకు బేధం.

32. మీరు పవిత్రులు మీకు కృతార్థులవటానికి  చేతులు జోడించుకొని మీ వద్దకు శరణాగతులై రావాలి.

33. గోదావరి జలానికి పాత్రతను బట్టి పవిత్ర వచ్చింది.నీరు వేరే ఎక్కడైనా ఒక్కటే.

34. గోదావరి జలాలు ప్రవహించే ఆ భూస్థలం పవిత్రమని అక్కడి భూమి యొక్క గుణాలను బట్టి నిర్ణయించబడింది.

35. మేఘుగర్భములోని నీటిని ఏ ప్రదేశం ఏ మార్పు చేయదో అదే భూభాగాన్నిగోదావరి అని శాస్త్రవేత్తలు అన్నారు.

36. ఇతర ప్రదేశాలలో పడిన నీరు ఆయా స్థలాల గుణాలను గ్రహిస్తాయి.మొదట్లో మధురంగా ఉన్న నీరు ఆయా ప్రదేశం లోని ప్రభావం వలన ఆనారోగ్యంగా,ఉప్పగా, వగరుగా మారుతుంది.

37. గురువరా! మీ పట్లే కూడా అట్లే ! కామక్రోధాది అరిషడ్ వికారాల మాలిన్యాలు లేని పవిత్ర శరీరానికి సత్పురుషులనే నామం శోభిస్తుంది.

38. అందువలన సత్పురుషులు గోదావరి అని నేను అంటాను.సకల జీవులలోను మీ యోగ్యతే శ్రేష్ఠమైనది.

39. జగత్తు ఆరంభమైనప్పటి నుండి గోదావరి ఉంది. నీరు కూడా ఏ లోపం లేకుండా ఈనాటి వరకు పరిపూర్ణంగా ఉన్నది.

40. శ్రీ రాముడు గోదావరి తీరానికి వచ్చినప్పుడు నదిలో ఉన్న నీరు ఇప్పటివరకు ఉంటుందా!

41. నీరు ఉన్న స్థలం మాత్రం ఇక్కడ మిగిలిఉంది.నీరు సాగరంలో కలిసి పోతుంది.అయిన నీరు ఉన్న స్థలం యొక్క పవిత్రత నేటి వరకూ స్థిరంగా ఉంది.

42. ప్రతి సంవత్సరమూ పాత నీరు పోయి కొత్త నీరు వస్తూనే ఉంటుంది. మీ పట్లకుడా ఇదే న్యాయం వర్తిస్తుంది.

43. ఒక శతాబ్దంలోనిదే సంవత్సరం.ఆశతాబ్దంలోని సత్పురుషులు నీటి ప్రవాహం వంటివారు. సాధువులు ఆ నీటిపై అలల వంటివారు.

44. ఈ పవిత్ర గోదావరి వద్దకు ప్రథమ శతాబ్దంలో సనత్ సనకసనందనాదులు వచ్చారు.

45. తరువాత నారద,తుంబుర,ధ్రువ,ప్రహ్లాద, బలి మొదలగు రాజులు శబరి,అంగదుడు, హనుమంతుడు,విదురుడు, గోప గోపికలు వచ్చారు.

46. ఇలా ఈనాటి వరకు ప్రతి శతబ్దిలోనూ పుష్కలంగా వచ్చారు. వారిని వర్ణించడానికి నేను అసక్తుణ్ణి.

47. ప్రస్తుతం ఈ శతాబ్దంలో పవిత్ర గోదావరి సమీపాన సాయినాధులైన మీరు వచ్చారు.

48. అందువలన మీ దివ్య చరణాలకు నేను వందనం చేస్తాను. ప్రభూ! నా దుర్గుణాలను పరిగణించకండని వేడుకుంటున్నాను.

49. నేను హీనుణ్ణి,ధీనుణ్ణి,అజ్ఞానుణ్ణి,పాతకశిఖామణిని,ఇలా సకల చేడు లక్షణాలు కలవాణ్ణి అయిన దేవా! నన్ను ఉపేక్షించకండి.

50. పరుశువేది ఇనుములోని దోషాలు పట్టించుకోదు. గోదావరి ఊరిలోని కాలువలను బహిష్కరించదు.

51. శ్రీ సాయిబాబా మీ కృపాకటక్షములతో నాలోని ఉన్న సకల కల్మషాలను త్వరగా తొలగించండి ఇదే ఈ దాసుని విన్నపము.

52. పరుశువేది సాంగత్యంతో ఇనుము బంగారం కాకపోతే ఆ లోపం పరుశువేదిది.

53. మీరు పరుశవేది నేను ఇనుమును. నాలో పరివర్తన రాకపోతే ఆ లోపం మీ పైన ఆపాదింపబడకూడదు. మీకు అప్రతిష్టరాకూడదు.కనుక నన్ను పాపిగా ఉంచకండి.

54. పిల్లలు ఎప్పుడు తప్పులు చేస్తువుంటారు.కానీ తల్లి కోపగించుకోదు. దీనిని దృష్టిలో ఉంచుకొని  బాబా! నన్ను అనుగ్రహించండి.

55. ఓ సద్గురు సాయినాధా! మీరే మా కల్పతరువు, భవసాగరాన్ని తరింపజేసే నౌక నిశ్చయంగా మీరే.

56. మీరు కామధేనువు, చింతామణి,మీరు జ్ఞానాకాశంలోని భాస్కరులు.సద్గుణాలగని, స్వర్గానికి సోపానము.

57. ఓ పరమపావన పుణ్యమూర్తీ! శాంతిస్వరూపా!ఆనందఘునా! ఓ చిత్స్వరూపా! పరిపూర్ణ! ఓ బేధారహిత!జ్ఞానసింధూ!

58. ఓ విజ్ఞానమూర్తీ!పురుషోత్తమా!క్షమాశాంతులకు నిలయమా! ఓ భక్తజనుల విశ్రమదామమా!నన్ను అనుగ్రహించండి.

59. మీరు సద్గురు మచ్చింధ్రులు. మీరే మహాత్ములైన జలందర్, మీరే నివృత్తినాద్ జ్ఞానేశ్వరులు, కబీర్,షేక్ మహమ్మద్, ఏకనాథులు మీరే.

60. మీరే బోధలా,సావతమలి,సమర్ధ రామదాసూ మీరే! సాయినాదా మీరే తుకరాం. మీరే సఖారాం, మీరే మాణిఖ్యప్రభు.

61. ఈ మీ అవతారాల లక్ష్యం అనూహ్యం. మీరు మీజాతిని గూర్చి ఎవరికి తెలియపరచలేదు.

62. మీరు బ్రహ్మణులని అని కొందరు,యవనులు అని కొందరు అంటారు.మీరు శ్రీ కృష్ణుని వలే లీలలను ప్రదర్శించారు.

63. శ్రీ కృష్ణుని ప్రజలు పలురకాలుగా అన్నారు. కొందరు యదుకుల భూషణుడని అన్నారు. కొందరు పశువుల కాపరి అని అన్నారు.

64. సుకుమార బాలుడు అని యశోద అన్నది.మహకాలుడని కంసుడన్నాడు. ప్రేమమయుడని ఉద్ధవుడంటే, జ్ఞానశ్రేష్టుడని అర్జునుడన్నాడు.

65. ఆ విధంగా శ్రీసాయిగురుదేవా! ప్రజలు మిమ్మల్ని వారి వారి మనసులకు తోచినట్లు భావిస్తున్నారు.

66. మీ నివాసస్థానం మసీదు.మీ చెవులు కుట్టి ఉండేవి.మీరు పాటించిన మహమ్మదీయ నైవేద్య పద్ధతులు చూచి ప్రజలు మిమ్మల్ని ముసల్మాను అని తలచారు.

67. కానీ దయా ఘనా! మీ అగ్ని ఆరాధనను గని మీరు హిందువని మా మనసులను నిశ్చయమైంది.

68. ఈ వ్యావహారిక బేధాలలో తార్కికులు తర్జనభర్జనలు చేస్తారు. కానీ జిజ్ఞానులు భక్తులు వీటిని పట్టించుకోరు.

69. మీది పరబ్రహ్మస్థితి, జాతి మతాలు మీకు వర్తించవు. మీరు అందరికి గురుమూర్తి,మీరు ఆది కారణులు.

70. హిందూ ముసల్మానులలో వైరవభావం ఉన్నది. వారిలో ఐక్యతను కలిగించటానికి, భక్తులకు మీ లీలలను చూపించటానికి మీరు మసీదులో అగ్ని ఆరాదనను చేపట్టారు.

71. మీరు జాతి మతాలకు అతీతమైన సాక్షాత్ సద్ వస్తువు.పరబ్రహ్మ. అందువలన మీరు తర్కానికి అంతు చిక్కరు.

72. తర్కవితర్కల గుర్రపు స్వారీ మీ వద్ద నిలువజాలదు. అటువంటప్పుడు నా మాటలు నిలువగలవా?

73. అయినా మిమ్మలి చూసి నేను మౌనంగా ఉండలేను . కారణం వ్యవహారంలో స్తుతించడానికి సాహిత్యలోని మాటలే సాధనాలు.

74. అందువలన  మీ అనుగ్రహంతో సాధ్యమైనంత వరకు వర్ణిస్తూ ఉంటాను.

75. సత్పురుషుల ఘనత గొప్పది.దేవతలకంటే కూడా అధికం. ఎందుకంటే సత్పురుషుల వద్ద 'నా'  'నీ' అనే బేధబావాలు ఉండవు.

76. హిరణ్యకశిపుడు, రావణాసురుడు దేవుణ్ణి ద్వేసించుట వలన వధింపబడ్డారు. అలా సత్పురుషుల చేతిలో వధింపబడిన వారు ఒక్కరైనా లేరు.

77. గోపీచంద్ జనులందరుని పెంటకుప్పలో పాతి పెట్టినప్పుడు ఆ మహాత్ముునికి దుఃఖం కలుగలేదు.

78. సరికదా...! పై పెచ్చు ఆ రాజుని ఉద్ధరించి చిరంజీవిగా మార్చాడు. ఇటువంటి సత్పురుషుల మహిమను ఎంతని వర్ణించగలను?

79. సత్పురుషులు సూర్యనారాయణుని వంటివారు.వారి కృపా జ్ఞానప్రకాశం. వారు చల్లటి సుఖాన్ని ఇచ్చే చంద్రుని వంటివారు.వారి కరుణా వెన్నెల వెలుగు.

80. సత్పురుషులు కస్తూరి వంటి వారు.వారి కృపపరిమళం వంటిది. సత్పురుషులు చెరుకు రసం వంటివారు వారి కృప మధురం.

81. సత్పురుషులు దుష్టులపట్ల,శిష్టులపట్ల సమాన దృష్టి కలిగి ఉంటారు. అంతే కాదు పాపుల పట్ల వారికీ ప్రీతి ఎక్కువ.

82. గోదావరి జలంలో శుభ్రపరచడానికి మలిన వస్త్రాలే వస్తాయి. శుభ్రమైన బట్టలు గోదావరికి దూరంగా పెట్టిలోనే ఉంటాయి.

83. పెట్టెలోని బట్టలు కూడా శుభ్రపరచడానికి ఒకప్పుడు గోదావరికి వచ్చినవే.

84. ఇక్కడ ఆ పెట్టె పైకుంఠం. మీరు గోదావరి. శ్రద్ధ సాన ఘట్టం. జీవాత్మలే వస్త్రాలు. వాని మాలిన్యం షడ్ వికారాలు.

85. మీ పాద దర్శనమే గోదావరి స్నానం. మీరు  సకల మాలిన్యాలను తొలగించి నిర్మలంగా చేయగల సమర్థులు .

86. మేము ఈ ప్రపంచంలో మాటిమాటికి మలినులమై పోతున్నాము . అందువలన సత్పురుషుల సందర్శనం అవసరం.

87. గోదావరిలో నీరు పుష్కలంగా ఉండి,ఆ నీటిని శుభ్రపరచటానికి తెచ్చిన మలిన వస్త్రాలు శుభ్రం కాకుండా అక్కడి స్నానఘట్టాలపై ఉండిపోతే అది గోదావరికి అప్రతిష్ట కదా!

88. మీరు చల్లటి నీడ నిచ్చే వృక్షం. మేము తాపత్రయాలనే తీవ్ర ఎండబాధకు మాడిపోతున్న బాటసారులము.

89. ఓ గురువర్యా! కరుణామయా! మమ్ము ఈ తాపత్రయాల నుండి రక్షించండి. చల్లటి నీడ వంటి మీ కృప లోకొత్తరమైనది.

90. నీడ కోసం ఒక వృక్షం క్రింద కూర్చున్నప్పుడు పైనుండి ఎండ వేడి తగులుతుంటే ఈ వృక్షాన్ని నీడనిచ్చే చెట్టు అని ఎవరు అంటారు!

91. మీ కృప లేకుండా ఈ ప్రపంచంలో బాగుపడటం జరగదు. ధర్మస్థాపన కొరకు అర్జునునికి శ్రీ కృష్ణుడు సఖునిగా లభించాడు.

92. సుగ్రీవుని కృపతో విభీషణునికి శ్రీ రామప్రభువు లభించాడు. సత్పురుషుల వలననే భగవంతునికి ఘనత.

93. వేదశాస్త్రాలు వర్ణించలేని నిరాకారనిర్గుణ పరబ్రహ్మను సగుణసాకార రూపంలో భూమిపైకి అవతరింపచేసింది సత్పురుషులే.

94. రుక్మిణీ వల్లభుడైన వైకుంఠపతియగు శ్రీ కృష్ణుని దామాజి మాలవానిగా చేసాడు. చోఖాబా జగన్నాథునితో పశువుల శవాలను మోయించాడు.

95. సత్పురుషుల మహిమలను ఎరిగి శ్రీహరి సక్కుబాయి ఇంట నీళ్ళు మోసాడు. నిజంగా సత్పురుషులు సచ్చిదానంద పరమాత్మను శాసించగలరు.

96. ఇంకా అధికంగా  చెప్పవలసిన అవసరం లేదు .  సాయినాధా! షిర్డీ గ్రామ నివాసీ! మీరే మా తల్లి తండ్రి .

97. బాబా ! మీ లీలలు నిజంగా ఎవరికి అంతుపట్టవు. అటువంటప్పుడు పామరుణైన  నా వాక్కుకు మీ లీలలు వర్ణించ సాధ్యమా?

98. జడుల వంటి జీవులను ఉద్ధరించడానికి మీరు షిర్డీ వచ్చారు. ప్రమీదలలో నీరు పోసి దీపాలను వెలిగించారు.

99. మూరెడు వెడల్పుగల చెక్కపలకను మంచంలా, పైన చూరుకు వేలాడగట్టి , దాని పై శయనించి భక్తులకు మీ యోగ శక్తి సామర్ధ్యాన్ని తెలియజేసారు.

100. మీరు అనేకులకు సంతానాన్ని అనుగ్రహించారు. విభూతుని ప్రసాదించి అనేకుల రోగాలను పోగొట్టారు.

101. ఐహిక కష్టాలు తొలగించటం మీకు ఆశక్యం కాదు.గజరాజుకు చీమ బరువా?

102. గురుదేవా ! దీనులను కరుణించండి.మీ చరణాలకు శరణుజొచ్చిన నన్ను వెనుకకు నెట్టి వేయకండి.

103. మీరు మహారాజులకు మహారాజు, కుబేరులకు కుబేరులు, వైద్యులకు వైద్యులు, నిశ్చయంగా మీ కంటే శ్రేష్టులు ఎవరు లేరు.

104. ఇతర దేవతల పూజలకు విశేషమైన పూజా సామాగ్రి, ప్రత్యేక పూజా విధానం అవసరం. కానీ మీ పూజకు జగత్తులో విశిష్టమైన వస్తువు ఏది లేదు.

105. సూర్యుని ఇంటిలో దీపావళి పండుగ వచ్చినట్లైతే, ఏ ద్రవ్యాలతో ఈ పండగను జరుపుకుంటారు?

106. సాగరం యొక్క దప్పికను తీర్చడానికి ఈ భూమి పై  నీరు లేదు. అగ్నిని రగల్చటానికి నిప్పు ఎక్కడ నుండి తేవాలి?.

107. గురు దేవా - శ్రీ సాయి సమర్థా! పూజ చేసి వస్తువులన్నీ ఆది నుండి మీ ఆత్మ యొక్క అంశాలు.

108.ఈ మాటలన్నీ తత్వదృష్టితో ఊరికే చెప్పటమే గాని పరమాత్మ తత్వం ఇంకా పట్టుపడలేదు.అందువల్ల అనుభవజ్ఞానం లేకుండా చెప్పే మాటలు నిరార్థకం.

109. మీ పూజను వ్యావహారికంగా చేయటానికైనా నాకు సామర్థ్యం లేదు.

110.  అందువలన గురుదేవా! అనేక కల్పనలతో మీ పూజ చేస్తాను. దయమయా! ఈ దాసుని యొక్క పూజను స్వీకరించండి.

111. ఇక ప్రేమాశ్రువులతో మీ చరణలను ప్రక్షళనం చేస్తాను.సద్భక్తి అనే చందనాన్ని రాస్తాను.

112. శబ్దాలంకారాల కఫనీని సమర్పిస్తాను.ప్రేమా భావాల సుమమాలను మీ కంఠానికి అలంకరిస్తాను.

113. నా దుర్గుణాలను ధూపంగా దహింపచేస్తాను.అవి చెడు ద్రవ్యాలే అయిన వాటినుండి చెడు వాసనలు రావడం లేదు.

114. ధూప ద్రవ్యాలను సద్గురువు వద్ద కాక ఇతరత్రా ఎక్కడ కాల్చిన ఆ ధూపద్రవ్యాల నుండి వెలువడే వాసనలు అలాగే ఉంటాయి.

115. ధూప ద్రవ్యాలు అగ్నిని తాకగానే తక్షణం వాని సువాసనలు వెలువడతాయి.

116. మీ వద్ద వ్యతిరేకంగా జరుగుతుంది. మాలిన్యాలు అగ్నిలో కాలిపోయి సద్గునాల పరిమళం ప్రపంచానికి తెలిసేలా మిగిలి ఉంటుంది.

117. గంగా జలంలోని మురికి పోగానే నీరు నిర్మలమవటం సహజం. మనసులోని మాలిన్యంపోయి మనసు నిర్మలమౌతుంది.

118. గురుదేవా! నేను మాయా మోహాలనే  దీపాలను వెలిగిస్తాను.దాని వలన వైరాగ్య ప్రభలను లాభంగా పొందేలా అనుగ్రహించండి.

119. మీరు ఆశీనులవటానికి శుద్ధమైన శ్రద్ధ అనే సింహాసనాన్ని అర్పిస్తాను. దానిపై విరాజమానులై భక్తి నైవేధ్యాన్ని స్వీకరించండి.

120. ఈ భక్తినైవేద్యాన్ని మీరు సేవించి , భక్తిరసాన్ని నాకు ఇవ్వండి. ఎందుకంటే నేను మీ బిడ్డను కనుక మీ బోధామృతరసాన్ని పానం చేసే అధికారం నాకు ఉన్నది.

121. నా మనసును మీకు దక్షిణగా సమర్పించుకుంటున్నాను. దానివల్ల నాకు ఎటువంటి కర్తృత్వభావం ఉండదు.

122. ఇక ప్రార్థన పూర్వకముగా సాష్టాంగదండ ప్రణామాలనుచేస్తాను స్వీకరించండి. పుణ్యశ్లోకా సాయినాథా!

# ప్రార్ధనాష్టకం

123.శాంతచిత్తా! మహాప్రజ్ఞా! సాయినాథా! దయఘనా! దయసింధూ! సత్స్వరూపా!మాయాంధకారాన్ని నాశనం చేసేవాడా!

124. (1)జాతిమత గోత్రాతీతా! సిద్దా! అచింత్య! కరుణాలయా! పాహిమాం - పాహిమాం సాయినాథా ! శిరిడీగ్రామనివాసీ !

125. (2)శ్రీ జ్ఞానభాస్కరా! జ్ఞానదాత!సర్వమంగళకారకా!భక్తచిత్తమరాళా, శరణాగత రక్షకా...

126. (౩)మీరు సృష్టికర్త బ్రహ్మ, మీరు పాలన కర్త విష్ణుమూర్తి, త్రిలోకాలను లయం చేసే మహేశ్వరులు మీరే.

127. (4) ఈ పృథ్వీతలం అందు మీరు లేని చోటంటూ ఉందా? శ్రీ సాయినాథా మీరు సర్వజ్ఞులు , సర్వహృదయాలలోనూ వున్నారు.

128. (5) మా సర్వాపరాధాలను క్షమించండి.

129. (6) మీరు ఆవు. నేను లేగదూడను. మీరు చంద్రుడు నేను చంద్రకాంతమణిని.గంగా నదీ రూపమైన మీపాదాలకు ఈ దాసుడు సాదరంగా నమస్కరిస్తున్నాడు.

130. (7) నా శిరస్సు పై మీ కృపహస్తాన్ని ఉంచండి.మీ దాసుడైన ఈ గణుని చింతను దుఃఖాలను నివారించండి.

131. (8) ఈ ప్రార్ధనాష్టకంతో మీకు సాష్టాంగ నమస్కారం చేస్తున్నాను. మా పాపతాప దైన్యాలను త్వరగా నివారించండి.

132. మీరు ఆవు. నేను లేగ దూడను. మీరు మా తల్లి .నేను మీ బిడ్డను. నా విషయంలో మీ మనసున కాఠిన్యతను వహించకండి.

133. మీరు మలయగిరి చందనం. నేను ముళ్ల పొదను. మీరు పవిత్ర గోదావరి నీరు. నేను మహాపాతకుణ్ణి.

134. మీ దర్శనమయ్యాక కూడా నా మనోమాలిన్యాలు తొలగిపోక ఇంకా ఉంటే మిమ్మల్ని చందనం అని ఎవరంటారు?

135. కస్తూరి సాంగత్యంతో మట్టికి విలువ వస్తుంది.పూవుల సహవాసంతో ఉన్న దారం శిరస్సు పై ఉంటుంది.

136. అదే విధంగా మహాత్ములు చేపట్టిన వస్తువులు విశిష్టతను సంతరించుకుంటాయి.

137. పరమేశ్వరుడు తన కోసం విభూతిని,మృగచర్మాన్ని నందిని స్వీకరించాడు. ఆ కారణంగానే వాటికి అంతటా గౌరవం లభిస్తుంది.

138. శ్రీ కృష్ణుడు గోపాలురును రంజింపచేయటానికి, బృందావనంలో యమునా తీరాన ఉట్లుకొట్టే ఆటలాడాడు. దానిని కూడా బుధులు గౌరవించారు.

139. నేను ధురాచారిని అయినా మీ శరణుజొచ్చాను. అందువలన ఓ గురుదేవా! నాగురించి ఆలోచించండి.

140. ఐహిక లేక పారమార్థిక వస్తువులు ఏవేని నా మనసుకు సుఖమనిపిస్తాయో వానిని ప్రసాధించండి  గురుదేవా!

141. నా మనసును నిగ్రహించుకునేలా నన్ను అనుగ్రహించండి. సముద్రపు నీరు తీయగా మారితే ఆ ఉప్పు నీటికి భీతి చెంద నవసరం లేదు కదా!

142. సాగరాన్ని మధురంగా మార్చగల సామర్థ్యం మీకు ఉన్నది. అందువలన ఈ దాసగణుని  ఈ కోరికను మన్నించండి.

143. నాలో ఉన్న లోపాలన్ని మీవే. మీరు సిద్ధులకు రాజు మీకు లోపాలు తగవు.

144. ఇంకా అధికంగా ఎం మాట్లాడను.మీరే మాకు అధారం. తల్లి ఒడిలో ఉన్న బిడ్డకు నిర్భయం సహజం కధా!

145. ఈ స్తోత్రాన్నీ ఎవరైతే భక్తిగా పఠిస్తారో వారి కోరికలను మీరే తీర్చాలి.మహాప్రభూ!

146. ఈ స్తోత్రానికి మీ ఆశీర్వచనం ఎల్లప్పుడూ ఉండాలి. ఒక సంవత్సరంలో పాఠకుల త్రీతాపాలు తొలగిపోవాలి.

147. శుచిర్భూతులై తమ మనసులలో శుద్ధమైన భక్తిభావంతో నిత్యం ఈ స్తోత్రాన్ని పఠించాలి.

148. ఇది వీలుపడకపోతే ప్రతి గురువారమైనా సద్గురు మూర్తిని మనసున ధ్యానించి పఠించాలి.

149. ఇది కూడా వీలుకాక పోతే ప్రతి ఏకదాశి రోజున ఈ స్తోత్రాన్ని పఠించి, దీని ప్రభావాన్ని గ్రహించండి.

150. భక్తులారా ! ఈ స్తోత్రాన్ని పఠించే వారి ఐహికకోరికలను గురుదేవులు వెంటనే తీర్చి, వారికి ఉత్తమ గతిని ప్రసాదిస్తారు.

151. ఈ స్తోత్ర పారాయణముతో మందబుద్ధులు బుద్ధిమంతులౌవుతారు.అల్పాయుష్యులు శతాయుష్కులౌతారు.

152. ఈ స్తోత్రాన్ని పఠిస్తే ధనహీనుల ఇంటికి కుబేరుడు వస్తాడు. ఇది ముమ్మాటికీ సత్యం

153. ఈ స్తోత్రాన్ని పఠిస్తే సంతానహీనులకు సంతానం కలుగుతుంది. మరియు సకల రోగాలు నలుదిశలా పారిపోతాయి.

154. నిత్యం యీ స్తోత్రాన్ని పారాయణం చేయుట వలన చింతలు భయాలు తొలగి, గౌరవ మర్యాదలు అభివృద్ధి చెందుతాయి.అవినాశియగు పరబ్రహ్మను తెలుసుకుంటారు.

155. కనుక బుద్ధిమంతులరా! మీ మనసులలో ఈ స్తోత్రమందు విశ్వాసముంచండి. తర్క వితర్కాలనే చెడు ఆలోచనలకు ఆసలు చోటివ్వకండి.

156. షిరిడీ క్షేత్ర యాత్రను చేయండి. మనసుని బాబా పాదాలయందు లగ్నం చేయండి.భక్తకామ కల్ప ధ్రువమైన సాయి ఆనాథులకు ఆశ్రయం.

157. వారి ప్రేరణ వలననే నేనీ స్తోత్రాన్ని రచించాను. లేకపోతే పామరుణ్ణిని అయిన నాకు ఇటువంటి రచన ఎలా సాధ్యం?

158. శక. సం. 1840 భాద్రపద శుక్లపక్షంలో (9-9-1918) వినాయకచవితి సోమవారం రోజు సూర్యోదయమయాక,

159.మహేశ్వర వద్ద , పవిత్ర నర్మదానది తీరాన శ్రీ అహల్యాదేవి సమాధి వద్ద శ్రీ సాయినాథ స్తవనమంజరి సమాప్తి అయింది.

160. మహేశ్వర క్షేత్రమందు సంపూర్ణమైన ఈ స్తోత్రంలోని ప్రతి పదాన్ని శ్రీ సాయినాథులు నా మనసులో ప్రవేశించి పలికించారు.

161. శిష్యుడు దామోదరుడు వ్రాసి పెట్టాడు. దాసగణుడైన నేను సాధుసత్పురుషుందరికి దాసుడను.

162.  స్వస్తి. శ్రీ సాయినాథ స్తవనమంజరి భవసాగర తారకం కావాలి. పాండురంగా! దీనిసే దాసగణు అత్యాదరంగా విన్నవించుకుంటున్నాడు.

163.  శ్రీ హరి హరార్పణమస్తు. శుభం భవతు.

పుండరీక వరదా! హరి విఠల్. సీతాకాంత స్మరణ జయ జయ రామ.

పార్వతిపతే హర హర మహా దేవా.!

శ్రీ సద్గురు సాయినాథ మహరాజ్ కీ జై

శ్రీ సద్గురు సాయినాతార్పణమస్తు. శుభం భవతు.